ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో శ్రీ విజయగణపతి, రాజరాజేశ్వరీ, శ్రీ సీతారామాంజనే స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ఏర్పాటు కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. జగద్గురు శంకరాచార్య, శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థాన పీఠాధిపతులు శ్రీ విద్యారణ్య భారతిస్వామి ఆధ్వర్యంలో జరిగిన మహోత్సవంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు బలరాం, ఆలయం అధ్యక్షులు ఎల్లారెడ్డి, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభకు తరలిరావాలి

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో శనివారం నిర్వహించే బహిరంగ సభకు శేరిలింగంపల్లి నుంచి పార్టీ శ్రేణులు భారీ తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులు మధ్యాహ్నం 2 గంటలకు గచ్చిబౌలిలోని ఓఆర్ఆర్ నార్సింగి ఫ్లైఓవర్ నుంచి సభాస్థలికి వెళ్ళాలని సూచించారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి



బొటానికల్ గార్డెన్‌లో వాకర్లను కలిసిన రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: పేదవారిని ఆదుకునే మనసున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి సంగీతారెడ్డి కోరారు. శుక్రవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జీ రవికుమార్ యాదవ్‌తో కలిసి ఆమె వాకర్స్‌ను కలిశారు. జరగబోయే ఎన్నికలలో చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటు వేయాలని ఆమె అభ్యర్థించారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ కొండా గెలిస్తే నియోజకవర్గాన్ని ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేసేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, రవినాయక్, ప్రసాద్, చందు తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం

రాయదుర్గం: అంకుర ఆస్పత్రిలోని 9ఎం ఫెర్టిలిటీ సెంటర్ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఖాజాగూడలోని అంకుర ఆస్పత్రిలోని 9ఎం ఫెర్టిలిటీ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో డైరెక్టర్, హెడ్ డాక్టర్ శ్రీవాణి మాట్లాడారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తా చెదారం.. దుర్వాసన



వివేకానందనగర్ రామకృష్ణ వీధిలో పేరుకుపోయిన చెత్త



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వీధి పెద్దమ్మ తల్లి దేవాలయం పరిసర ప్రాంతాల్లో వీధుల వెంట చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. జీహెచ్‌యంసి సిబ్బంది సైతం తాము సేకరించిన చెత్తా చెదారాన్ని తీసుకువచ్చి ఇక్కడే పడవేయటంతో అది కాస్తా చెత్త డంపింగ్ ప్రాంతంగా తయారైంది. రెండు నెలలుగా జీహెచ్‌యంసి సిబ్బంది చెత్త కుప్పలను దూర ప్రాంతానికి తరలించకుండా అక్కడే ఉంచటంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రామకృష్ణ వీధిలో శుభ్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇఫ్తార్ విందు

మియాపూర్: పండగలను మతసామరస్యాలకు ప్రతీకగా జరుపుకోవాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ మదీనాగూడలోని దీప్తిశ్రీనగర్ కాలనీలో శుక్రవారం సాజిద్ ఆధ్వర్యంలో దావత్ ఏ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అన్వర్ షరీఫ్ ప్రవీణ్, అక్బర్ ఖాన్, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

పుష్కర కాలమైనా..

ప్రారంభానికి నోచుకోని ఖాజాగూడ స్టేడియం ● కొత్త ప్రభుత్వంలోనైనా గ్రహణం వీడేనా !



ఖాజాగూడలోని మినీ ఇండోర్ స్టేడియం భవనం ఇదే..



ఖాజాగూడలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఫ్లైఓవర్ల సామగ్రిని ఉంచిన దృశ్యం

గచ్చిబౌలి: పుష్కర కాలమవుతున్నా...ఖాజాగూడ మినీ స్టేడియానికి పట్టిన గ్రహణం మాత్రం వీడడం లేదు. సరిగ్గా పన్నెండేళ్ల క్రితం అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేయగా, నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం జరగక ముందే శిథిలావస్థకు చేరుకుంటుందనే విమర్శలున్నాయి. జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌ను మినీ స్టేడియం పేరుతో స్థానిక యువతకు దూరం చేసిన పాలకులు ఆటస్థలాన్ని కాస్తా డంపింగ్ యార్డుగా మార్చారు. కొత్త ప్రభుత్వంలోనైనా ఖాజాగూడ మినీ స్టేడియానికి పట్టిన గ్రహణం వీడుతుందా అని యువత, క్రీడాకారులు ఎదురు చూస్తున్నారు.

- శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలో 7.5 ఎకరాల విస్తీర్ణంలో జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్ విస్తరించి ఉంది. గతంలో చుట్టు పక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల క్రీడోత్సవాలు, వార్షికోత్సవాలు, ఐటీ కారిడార్‌లో ఉన్న చిన్నచిన్న సాఫ్ట్‌వేర్ సంస్థల క్రీడా వేడుకలకు ఈ గ్రౌండ్ వేదికగా నిలిచేది.
- ఐటీ కారిడార్ పరిధిలో ఉన్న ఏకైక జీహెచ్‌ఎంసీ గ్రౌండ్ ఇదే కావడంతో స్థానిక యువత క్రీడలకు ఉపయోగించుకోవడంతో ఎప్పుడూ క్రీడాకారులతో కళకళలాడేది.
- ఐటీ కారిడార్ మధ్యలో ఉన్న ఈ గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలని సంకల్పించిన ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ముందుకొచ్చింది.
- 2012 జూలై 21న నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా రూ.2.10 కోట్ల వ్యయంతో మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జోరుగా పనులు సాగినా రాష్ట్ర విభజనతో నిలిచిపోయాయి.
- రాష్ట్ర ఏర్పాటు తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి పనులను వేగవంతం చేసింది. గతంలో కేటాయించిన నిధులు కరిగిపోవడంతో మరో రూ.26 లక్షలు జీహెచ్‌ఎంసీ కేటాయించింది. ఇవీ సరిపోకపోవడంతో అనంతరం మరో రూ.11 లక్షలు కూడా కేటాయించారు. దీంతో ఇండోర్ స్టేడియం పూర్తయింది.
- 2,700 గజాల విస్తీర్ణంలో నాలుగు విశాలమైన బాడ్మింటన్ కోర్టులు, క్యారమ్స్, గదులు, మల్టీపర్పస్ మినీ జిమ్, క్రీడాకారులు, కోచ్‌లకు గదులు నిర్మించారు.

సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోనే స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, ప్రస్తుతం రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, సీఎం రేవంత్‌రెడ్డి అయినా అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు, స్థానికులు కోరుతున్నారు.

ఏళ్లుగా నిరుపయోగం..

- గత ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఈ ఇండోర్ స్టేడియానికి ఓ క్రీడాకారిణికి అప్పగించేందుకు ప్రయత్నించగా, స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో నిర్మాణం పూర్తయినా ప్రారంభించకుండా సంవత్సరాలుగా తాళాలు వేసి ఉంచడంతో ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకుంది.
- స్టేడియం వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో ఒకవైపు రెడీమిక్స్ ప్లాంట్ పెట్టారు. మరో వైపు జీహెచ్‌ఎంసీ చెత్తశుద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు.

క్రీడాకారులు, స్థానికుల డిమాండ్లు ఇవే..

- ఖాజాగూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఇతర అవసరాలకు వినియోగించడం తక్షణం నిలిపివేయాలి
- క్రీడాకారులు శిక్షణ పొందేలా కోచ్‌లను నియమించాలి
- వేసవి సమ్మర్ క్యాంప్‌లను ఈ ఏడాది నుంచే ఏర్పాటు చేయాలి
- ఇండోర్ స్టేడియం భవనం ఎదుట పార్క్ చేస్తున్న కార్లను కూడా తొలగించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు శ్రీవారి కల్యాణం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ప్రతి శనివారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఈఓ జీఏకె కృష్ణ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శంషాబాద్: పట్టణంలోని 20 వార్డులో శ్రీ లక్ష్మీనరసింహస్వామి 9 వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్.గణేషగుప్తా, పట్టణ అధ్యక్షుడు డి. వెంకటేష్‌గౌడ్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్తంగా శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశాయి . ఈ శిబిరంలో 61 యూనిట్ల రక్తాన్ని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది దానం చేశారు. రక్త దానం చేసిన వారికి పళ్లరసం, బిస్కెట్లను అందించారు.

పశువుల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడలో ప్రతి శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు పశువుల సంత జరిగిద్ది. రంగారెడ్డి జిల్లా నార్సింగ్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఈ సంత కొనసాగుతుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు పశువుల అమ్మకాలు, కొనుగోలు చేపడతారు.

హెచ్‌సీయూ-ఏఎన్‌ఎస్‌ఐల ఒప్పందం



సంతకాలు చేసిన ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఎస్ఐ)ల మధ్య శాస్త్రీయ అవగాహన, అనుకూలమైన ఫలితాలను ప్రోత్సహించడానికి పరస్పర ఒప్పందం కుదిరింది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో శుక్రవారం వైస్‌చాన్స్‌లర్ ప్రొ.బీజేరావు, సీనియర్ ప్రొఫెసర్ పొదిలి అప్పారావు సమక్షంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, ఆంతోరపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ ప్రొఫెసర్ బివిశర్మ ఒప్పందంపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ ఆనంద్ కొండపి, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఈన్, ఆర్ అండ్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్ సబాత్, ప్రొఫెసర్ హెచ్ఏ నాగరాజారామ్, ప్రొఫెసర్ బివిశర్మ, డాక్టర్ బిపి ఉరడే పాల్గొన్నారు.

డ్రైఫ్రూట్స్ పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో కౌన్సిలర్ పావని రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి డ్రైఫ్రూట్స్, సేమియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక సేవలో పాల్గొని పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీతోనే ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు సరిత శ్రీనివాస్ రెడ్డి, మంజుల, నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్యాంరావు, సుధాకర్ రెడ్డి, ఖదీర్, వాజిద్, మధు తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో మెడిసిన్ లా అండ్ మెడికల్ నెగ్లిజెన్స్ సదస్సు



సదస్సులో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో శుక్రవారం ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ సంయుక్తంగా బ్యాలెన్సింగ్ రెస్పాన్సిబిలిటీ , మెడిసిన్ లా అండ్ మెడికల్ నెగ్లిజెన్స్ అనే అంశాలపై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి, తెలంగాణ ఉత్తరాఖండ్ రాష్ట్రాల మాజీ హైకోర్టు ప్రధాన న్యామూర్తి రాఘవేంద్రసింగ్ చౌహాన్‌లు పాల్గొన్నారు, న్యాయనిపుణులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులతో కూడిన ప్యానెల్ వైద్యపరమైన నిర్లక్ష్యం,ఆరోగ్య సంరక్షణ పద్ధతులను నియంత్రించే చట్టపరమైన విధానాలకు సంబంధించిన వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ అన్నం శరత్‌రెడ్డి, చీఫ్ లీగల్ ఆఫీసర్ ఇషాసిన్హ తదితరులు పాల్గొన్నారు.

సాధన బాస్కెట్‌బాల్ అరేనా ప్రారంభం



హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్‌లో సాధన బాస్కెట్‌బాల్ అరేనాను శుక్రవారం భారత మహిళల బాస్కెట్‌బాల్ టీమ్ కోచ్ శ్రీనాథ్, చెస్ దిగ్గజాలు సూపర్ ట్విన్స్ అమయా అగర్వాల్, అనయ్ అగర్వాల్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకితభావం, నైపుణ్యాలు చదరంగంలో చేసిన కృషి శ్రేష్ఠమైనది అని అన్నారు. అనంతరం సూపర్ ట్విన్స్‌ను, బాస్కెట్‌బాల్ కోచ్ శ్రీనాథ్‌లను శాలువా, బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో వర్మ కస్టమ్స్ టీమ్ కెప్టెన్, డాక్టర్ లీనా ప్రియంబద, కాశీ, దాట్ల విశ్వనాథ్, సాధన అరేనా డైరెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం.. కాలిపోయిన ఫర్నిచర్



మియాపూర్: ఫర్నీచర్ దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. మెట్రో స్టేషన్ సమీపంలో న్యూ కాలనీ వద్ద జాతీయ రహదారి పక్కన ఫుట్‌పాత్‌ను ఆనుకుని పదుల సంఖ్యలో ఫర్నీచర్ షాపులున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఓ షాపులో మంటలు రేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రంకు సమాచారం అందించడంతో వారు సకాలంలో మంటలను అదుపుచేశారు. దీంతో చుట్టుపక్కల ఉన్న ఫర్నీచర్ షాప్ యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఫర్నీచర్ దుకాణాల వెనుక ఖాళీ స్థలంలో చెత్తను కాల్చడంతో మంటలు సోఫాలు, మంచాలు, కుర్చీలకు అంటుకున్నాయి. సుమారు రూ.లక్ష 50వేలు నష్టపోయినట్లు బాధితులు తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం.. కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి పై కేసు నమోదైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... అమీన్‌పూర్ కేఎస్ఆర్ కాలనీకి చెందిన శ్యాంప్రసాద్‌కు అతడి స్నేహితుడు విజయ్ హైదరాబాద్ ఇన్ఫోసిస్‌లో సీనియర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న రాంబాబు అనే వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తాడని అతని వివరాలు ఇచ్చాడు. దీంతో శ్యాంప్రసాద్ గత ఎడాది సెప్టెంబర్ 20వ తేదీన ఫోన్ చేసి ఉద్యోగం అడగగా అడ్వాన్స్‌గా రూ. 25 వేలు ఇవ్వాలని చెప్పడంతో బాధితుడు ఇచ్చాడు. అదేవిధంగా అతని స్నేహితులతో కలిసి మొత్తం తొమ్మిది మంది రెండు లక్షల 30 వేలు ఇచ్చారు. అయితే అడ్వాన్స్ తీసుకునే క్రమంలో ఉద్యోగం వచ్చిన తర్వాత అదనంగా ప్రతి ఒక్కరు రూ. 50 వేలు చెల్లించాలని చెప్పాడు.అనంతరం 9 మందికి ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఆఫర్ లెటర్ వస్తుందని నమ్మించాడు. తర్వాత పలుమార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో బాధితుడు శ్యాంప్రసాద్ శుక్రవారం అమీన్పూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి



ఖైరుల్ మియా (ఫైల్)

హఫీజ్‌పేట్: భవనంపై పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఖైరుల్ మియా (32) గత 15 రోజుల క్రితం లింగంపల్లి కాండ్యూర్ క్రిసెంట్ సైట్‌లో అతని అంకుల్‌తో కలిసి పనిలో చేరాడు. శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు భవనంలోని 30వ ఫ్లోర్‌లో పని చేస్తుండగా జారి 11వ ఫ్లోర్‌లో పడిపోయాడు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అంకుల్ చందానగర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్ట్‌మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

చంద్రమౌళీశ్వరునికి అభిషేకం

రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల గృహ సముదాయం గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో కొలువుదీరిన రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం ఆలయంలో నిత్యోపాసన, బలిహరణ మహన్యాస పూర్వక అభిషేకాలు, మహలక్ష్మీకల్పం, నీరాజన మంత్రపుష్పములు నిర్వహించారు. రాజరాజేశ్వరిమాతకు, చంద్రమౌళీశ్వరస్వామి వారికి అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

నేటి పూజలు



ఉత్సవాలలో భాగంగా చివరిరోజు శనివారం ఉదయం 8 గంటల మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి, ఆచార్యపూజ, ఆశీర్వచనం వంటివి నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి వారి పల్లకిసేవ, ఊయల సేవ, పుష్పయాగం పూజలు చేస్తారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

దేశ మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నియోజకవర్గంలో పలుచోట్ల ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. దేశానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని ఈ సందర్భంగా వారు కొనియాడారు. – రాయదుర్గం/హఫీజ్‌పేట్



హెచ్‌సీయూలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించిన వీసీ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సభ్యులు



చందానగర్‌లో.. రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, ఇతర నాయకులు



రాయదుర్గంలో..